క్లుప్తంగా

నేటి నుండి తుడా చైర్మన్ పర్యటన

భాకరాపేట: ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టనున్నట్లు ఎర్రావారిపాళెం ఎంపీడీవో అమర్‌నాథ్ తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 13న బుధవారం కమలయ్యగారిపల్లె, చింతగుంట, 14న గురువారం ఎల్లమంద, ఉస్తికాయలపెంట, కొటకాడపల్లె, వీఆర్‌అగ్రహారం, బోడేవాండ్లపల్లె, 15న నెరబైలు, ఎర్రావారిపాళెం, చెరుకువారిపల్లె, ఉదయమాణిక్యం, కూరపర్తివారిపల్లె సచివాలయాల పరిధిలో కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు విధిగా పాల్గొనాలని కోరారు.

16న స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏర్పాటు

తిరుపతి అర్బన్: ఈ నెల 16వ తేదీన స్కౌట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయాలని పాఠశాల కమిషనర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందాయని జిల్లా విద్యాశాఖాధికారి వి.శేఖర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు అసోసియేషన్ ఏర్పాటు కార్యక్రమం ఉంటుందని వెల్లడించారు. జిల్లాకు చెందిన స్కౌట్స్ మాస్టర్లు, గైడ్‌కెప్టెన్లు, క్లబ్ మాస్టర్లు, ఫ్లాక్ లీడర్లు, రోవర్ లీడర్లు, రేంజర్ లీడర్లు గత ఏడాది యూనిట్స్ రిజిస్ట్రేషన్ చేయించివారితోపాటు జీవిత సభ్యులు, ఇతర స్కౌట్స్ అధికారులు హజరు కావాలని కోరారు. తప్పకుండా అంతా యూనిఫాంతో రావాల్సి ఉందని స్పష్టం చేశారు.

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న మహిళా వర్సిటీ వీసీ భారతి

తిరుపతి సిటీ: విద్యార్థులు శారీరక మానసిక ఆరోగ్యంతోపాటు ఒత్తిడిని జయించి మంచి ఫలితాలు సాధించడానికి క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు దోహదం చేస్తాయని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ డి.భారతి తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర వ్యవసాయ కళాశాల వేదికగా, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రెండో విడత అంతర్ కళాశాలల క్రీడలు, ఆటలు, సాహిత్య సాంస్కృతిక సమ్మేళనం కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ సాంబశివరావు మాట్లాడుతూ సమ్మేళనంలో ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తితో పాల్గొనాలని విద్యార్థినీవిద్యార్థులకు సూచించారు. 678 మంది విద్యార్థినీ విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేట్ డీన్ ప్రభాకరరెడ్డి, పాలకమండలి సభ్యులు డాక్టర్ పీవీ సత్యగోపాల్, పీడీలు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

14న ప్రాంగణ ఎంపికలు

తిరుపతి సిటీ: భవానీనగర్‌లోని గేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈనెల 14న ప్రాంగణ ఎంపికలు జరగనున్నట్లు కళాశాల చైర్మన్ డాక్టర్ తమ్మినేని వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పలు ఎమ్‌ఎన్‌సీ కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొంటాయని, ఏదేని డిగ్రీ, బీటెక్, ఎంబీఏ చదివిన నిరుద్యోగ అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చని తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9000072357, 8099088704, 900041345, 8247520207 నంబర్లకు సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

370 ఆర్టికల్‌పై తీర్పు దురదృష్టకరం



మీడియాతో మాట్లాడుతున్న సీపీఐ నారాయణ

తిరుపతి కల్చరల్: జమ్మూకశ్మీర్ 370 ఆర్టికల్ పైన వచ్చిన తీర్పు దురదృష్టకరమని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తెలిపారు. మంగళవారం తిరుపతి సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశాన్ని విడగొట్టే రీతిలో బీజేపీ పాలన ఉందన్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో బీజేపీ పాలనపై ప్రజలు విసిగిపోయారని తెలిపారు. బైజూస్ సంస్థ ద్వారా ఆన్‌లైన్ క్లాసులు బోధిస్తామని వారు బజాజ్ సంస్థకు అప్పగించి వేలాది మంది విద్యార్థుల తల్లిదండ్రుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. తుపాను ప్రభావంతో 60 వేల ఎకరాల్లో పంటనష్టం జరిగిందన్నారు.

ఆచార్య గణపతి భట్‌కు ఘన సన్మానం

తిరుపతి సిటీ: అయోధ్యలో ఈ నెల 10వ తేదీ వరకు జరిగిన రామాలయం సంప్రోక్షణ కార్యక్రమంలో కాంచీపురం పీఠాధిపతి తరఫున హాజరైన తిరుపతి సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు గణపతి భట్‌ను వర్సిటీ అధికారులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వీసీ కృష్ణమూర్తి ఆయన ఘనంగా సన్మానించి మాట్లాడారు. అయోధ్య ప్రాంతానికి వెళ్లి ఏడు రోజులపాటు విశేష అనుష్టానాన్ని సరయూ నదీ తీరాన హోమం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ రమాశ్రీ, డీన్ అకడమిక్ అఫైర్స్ టీవీ రాఘవాచార్యులు, చక్రవర్తి రాఘవన్, డీన్ ప్రొఫెసర్ లలితా రాణి, ఆచార్య విష్ణుభట్టాచార్యులు, ఆచార్య సత్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన హోమ మహోత్సవాలు



పురవీధుల్లో విహరిస్తున్న పంచమూర్తులు

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయంలో కార్తీక మాసం సందర్భంగా నెల రోజుల పాటు చేపట్టిన హోమ మహోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. శ్రీకపిలేశ్వర స్వామివారి ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాగశాలలో నెల రోజులపాటు ఉదయం, సాయంత్రం వేళ విశేష పూజలు, హోమాలు చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు హోమాలలో పాల్గొని, పూజలు చేశారు. చివరి రోజైన మంగళవారం ఉదయం శ్రీచండికేశ్వర స్వామివారి హోమం వేడుకగా నిర్వహించారు. అనంతరం మహాపూర్ణాహుతి, కలశ ఉద్వాసన,



యాగశాలలో శ్రీచండికేశ్వరస్వామి హోమం

మహాశాంతి అభిషేకం, కలశాభిషేకం చేపట్టారు. అనంతరం కపిలతీర్థం పుష్కరిణిలో శాస్త్రోక్తంగా త్రిశూలస్నానాన్ని అర్చక పండితులు నిర్వహించి అంకుర విసర్జన చేశారు. త్రిశూలస్నాన సమయంలో భక్తులు పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవారిని దర్శించుకున్నారు. తర్వాత పంచమూర్తులను పురవీధుల్లో వేడుకగా ఊరేగింపు నిర్వహించారు. అడుగడుగునా భక్తులు పంచమూర్తులకు హారతులు సమర్పించి దర్శించుకున్నారు. ఆలయ డెప్యూటీ ఈవో దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గడప గడపలో జననీరాజనం

- వెంకటపతినగర్‌లో చెవిరెడ్డి లక్ష్మి పాదయాత్రకు అపూర్వ స్పందన



వెంకటపతినగర్‌లో గడప గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ప్రతి ఇంటా ఎనలేని అభిమానం.. జగనన్న ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల గుండెల్లో నిండుకున్న సంతోషం.. పల్లె ప్రగతితో పెరుగుతున్న జనాదరణతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి చేపట్టిన గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమానికి జననీరాజనం పలికారు. తిరుపతి రూరల్ మండలం వెంకటపతి నగర్ పంచాయతీలో మంగళవారం గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని రెండో రోజు చేపట్టారు. జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు వివరిస్తూ స్థానిక సమస్యలపై ఆరా తీస్తూ ప్రతి గడపకు వెళుతున్న చెవిరెడ్డి లక్ష్మికి అపూర్వ ఆదరణ లభించింది. వృద్ధులు, చంటి బిడ్డలను ఆప్యాయంగా పలకరించిన చెవిరెడ్డి లక్ష్మి, వారి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. గత ఎన్నికల్లో తన భర్త చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించారని, ఆ నాటి నుంచి నేటి వరకు జనం సంక్షేమం కోసం తపిస్తూ పల్లె ప్రగతిని పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. జగనన్న ప్రభుత్వం సంక్షేమాన్ని అందిస్తుంటే ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జరిగిన సంక్షేమం, అభివృద్ధి పనులు యథావిధిగా కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిన్నియాదవ్, ఎంపీటీసీ నారాయణమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏనుగుల గుంపు తరలింపునకు చర్యలు

- బాధిత గ్రామస్తులకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భరోసా



గ్రామస్తులకు ధైర్యం చెబుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

పాకాల: మండలంలో ఏనుగుల గుంపు హల్‌చల్ చేస్తోంది. వల్లివేడు పంచాయతీ పరిధిలో మామిడి తోటలపై విరుచుకు పడుతూ పంట నష్టానికి పాల్పడుతున్నాయి. సమాచారం తెలుసుకున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మంగళవారం ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన మామిడి చెట్లను పరిశీలించారు. అటవీ అధికారులతో మాట్లాడారు. పంట నష్ట తీవ్రతను అంచనా వేయాలని సూచించారు. అనంతరం వల్లివేడు గ్రామ సచివాలయం వద్ద ప్రజలు, బాధిత రైతులతో మాట్లాడారు. 10 ఏనుగుల గుంపు రాత్రి వేళల్లో వచ్చి పంటను నష్టపరచడం ఇది మూడో సారి అని తెలిపారు. వెంటనే చిత్తూరు, తిరుపతి జిల్లాల డీఎఫ్‌ఓలతో మోహిత్‌రెడ్డి మాట్లాడారు. బాధిత గ్రామస్తులతో ఆయన మాట్లాడుతూ అధైర్య పడకండి.. ఐకమత్యంగా మెలిగి అటవీ అధికారుల సహకారంతో ఏనుగుల గుంపును తరిమేద్దామని భరోసా కల్పించారు. ఏనుగుల గుంపును త్వరితగతిన తరలింపునకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అటవీ, ప్రభుత్వ అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

పశువృద్ధికి రోగ నివారణ అత్యంత ప్రధానం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు, అధికారులు

తిరుపతి సిటీ: పశువృద్ధికి, ఉత్పత్తి పెరుగుదలకు రోగ నిర్ధారణ, నివారణ ప్రధాన భూమిక పోషిస్తాయని మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.భారతి పేర్కొన్నారు. ఎస్వీ వెటర్నరీ కళాశాల ఆడిటోరియంలో పశు వ్యాధి నిర్ధారణ, నివారణ అనే అంశంపై మంగళవారం నుంచి మూడు రోజులపాటు జరిగే జాతీయ సదస్సును ఆమె వర్సిటీ అధికారులతో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. డాక్టర్ కె.సర్జన్‌రావు, డాక్టర్ రాణిప్రమీల, అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, అధ్యాపకులు, సుమారు 120మంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

టీటీడీ ఉద్యోగుల సంక్షేమానికి నిరంతర కృషి



సర్వసభ్య సమావేశంలో సన్మానం అందుకున్న టీటీడీ ఉద్యోగులు

తిరుపతి అలిపిరి: ఉద్యోగుల సంక్షేమానికి టీటీడీ జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నిరంతరం కృషి చేస్తోందని.. ఆ సంఘం అధ్యక్షుడు మునివెంకటరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కేటీ రోడ్డులోని ఎన్జీవోల ఫంక్షన్ హాల్‌లో టీటీడీ జనరల్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదిరేడులో టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల కేటాయింపునకు స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డితో.. టీటీడీ యాజమాన్యంతో పలుమార్లు చర్చించి స్థలాలు మంజూరుకు కీలక పాత్ర పోషించామన్నారు. ఉద్యోగుల ఆరోగ్య సమస్యలపై ఎప్పటికప్పుడు అసోసియేషన్ తరఫున సహాయ సహకారాలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సెక్రటరీ ఆఫ్ జనరల్ రవికుమార్, గౌరవాధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, మహీధర రెడ్డి, దాసు, సుబ్రహ్మణ్యం, కోటా శ్రీనివాస్, టీటీడీ ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



మంగళం డిపో వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు

తిరుపతి అర్బన్: ఆర్టీసీ ఉద్యోగులపై ప్రభుత్వం ఆది నుంచి ఎంతో సానుకూలంగా ఉందని.. అయితే కొందరు ఉన్నత స్థాయిలో ఉన్న అధికారులు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారంటూ ఎన్‌ఎంయూఏ జిల్లా కార్యదర్శి బీఎస్ బాబు పేర్కొన్నారు. మంగళవారం తిరుపతి సెంట్రల్ బస్టాండ్, అలిపిరి, మంగళం డిపోల వద్ద ఎన్‌ఎంయూఏ ఉద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఎస్ బాబు మాట్లాడుతూ తమ డిమాండ్లకు ప్రభుత్వం అనుకూలంగా ఉంటే అధికారులు వ్యతిరేకంగా ఉండడాన్ని తప్పుబట్టారు. ప్రధానంగా అరియర్స్ అందరికి ఒక్కసారిగా ఇవ్వడం, ఉద్యోగులను ఈహెచ్‌ఎస్ నుంచి మినహాయింపు, మెడికల్ లీవ్‌లోని ఉద్యోగులకు వేతనాలు, ప్రభుత్వం ఇచ్చిన ప్రమోషన్లు అమలు చేయడం, గ్యారేజ్ ఖాళీలను భర్తీ చేయడం తదితర సమస్యలకు వెంటనే పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ సంఘం నేతలు తాళ్ల మోహన్, నాగేశ్వరరావు, సిద్ధప్ప, శోభన్‌బాబు, ఎంఆర్ చంద్ర, ఆర్‌ఎం రెడ్డి, రామారావు, ఎంఎస్ నాయక్, పి.దేవరాజులు, పి.శరవణ తదితరులు పాల్గొన్నారు.

జానపద విజ్ఞానమే మన దేశీయ సంస్కృతి



మాట్లాడుతున్న భక్తవత్సలరెడ్డి

తిరుపతి సిటీ: జానపద విజ్ఞానం ద్వారానే మన సంస్కృతి పరిరక్షణ సాధ్యమవుతుందని హైదరాబాద్ శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు నాగపట్ల భక్తవత్సలరెడ్డి పేర్కొన్నారు. తెలుగు సారస్వత, సాంస్కృతిక సంఘం, న్యూయార్క్ మెట్రోపాలిటన్ ఏర్పాటు చేసిన ధర్మనిధి ఉపన్యాస కార్యక్రమం మంగళవారం సెనేట్ హాల్లో తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్, తెలుగు విభాగాధిపతి ఆచార్య రాజేశ్వరమ్మ, డాక్టర్ బ్రహ్మానందరెడ్డి, విశ్రాంతాచార్యులు జీడీ నాయుడు, శారద, కె దామోదర నాయుడు, మునిరత్నం, రాజేశ్వరి, మేడిపల్లి రవికుమార్, వెంకటరమణ, బి.కృష్ణారెడ్డి, రచయితలు ఆర్‌సీ కృష్ణస్వామి రాజు, పరిశోధకులు పాల్గొన్నారు.

ముగిసిన అథ్లెటిక్ మీట్

తిరుపతి సిటీ: రెండు రోజులుగా జరిగిన అంతర్ కళాశాలల అథ్లెటిక్ మీట్ మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా ఎస్వీయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి మాట్లాడుతూ 30 కళాశాలల నుంచి 350మంది ఈ అథ్లెటిక్ మీట్‌లో పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. విజేతలకు వర్సిటీ రిజిస్ట్రార్ బహుమతులు, అవార్డులు, పశంసాపత్రాలను అందజేశామన్నారు.


ఓటరు దరఖాస్తులు క్రమబద్ధీకరించండి



సూచనలిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ఓటరు దరఖాస్తులు క్రమబద్ధీకరించి, పెండింగ్ క్లెయిమ్‌లను క్షుణ్ణంగా పరిశీలించి మరో రెండు రోజుల్లోపు పూర్తి చేయాలని తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం స్టేట్ ఎలక్షన్ కమిషన్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం తిరుపతి నియోజకవర్గం ఓటర్ నమోదు సూపర్‌వైజర్లు, అదనపు సూపర్ వైజర్లతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు పని చేస్తూ, తిరుపతి నియోజకవర్గం ఓటర్ల లిస్టును తప్పులు లేకుండా తయారు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, ఆర్వో సేతుమాధవ్, డిప్యూటీ తహసీల్దార్ జీవన్, సూపర్‌వైజర్లు, అదనపు సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ చాంపియన్ ఎస్వీ డిఫెన్స్ అకాడమీ



విద్యార్థులను అభినందిస్తున్న ఎస్వీ డిఫెన్స్ అకాడమీ చైర్మన్ శేషారెడ్డి

తిరుపతి రూరల్: ఎస్వీ యూనివర్సిటీ అంతర్ కళాశాలల అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్వీ డిఫెన్స్ అకాడమీ(బీఎస్‌ఆర్ డిగ్రీ) కళాశాల చాంపియన్స్‌గా నిలిచింది. రెండు రోజులుగా వర్సిటీ స్టేడియంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల్లో 77 పాయింట్లతో ఓవరాల్ చాంపియన్స్‌గా గెలిచింది. చాంపియన్స్‌గా నిలిచిన విద్యార్థులను చెర్లోపల్లిలోని అకాడమీలో విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ శేషారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థి రాకేష్‌రెడ్డి వంద మీటర్ల పరుగులో సిల్వర్ మెడల్, 400 మీటర్ల హార్డిల్స్‌లో బంగారు, 200 మీటర్ల రన్నింగ్‌లో కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. బీఎస్సీ ఫైనలియర్ విద్యార్థి అనిల్‌కుమార్ 800 మీటర్ల రన్నింగ్‌లో బంగారు, 400 మీటర్ల పరుగులో వెండి పతకం, ప్రవీణ్ కుమార్ లాంగ్‌జంప్, ట్రిపుల్ జంప్ విభాగాల్లో బంగారు పతకాలు, జావెలిన్ త్రోలో వెండి పతకం, వెంకట అఖిలేష్ 400 మీటర్లలో బంగారు, 800 మీటర్లలో వెండి, 5000 మీటర్ల పరుగులో కాంస్య పతకాలను సాధించినట్లు తెలిపారు. విద్యతో పాటు క్రీడల్లోనూ అద్భుత ప్రతిభ చూపిన విద్యార్థులను, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

రష్ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు పంపిణీ



రోగులకు దుప్పట్లు పంచుతున్న ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది

తిరుపతి తుడా: కార్పొరేట్ వైద్యాన్ని సామాన్య ప్రజలకు అందిస్తూ రష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆసుపత్రి అధినేత ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం పేర్కొన్నారు. రెడ్డి అండ్ రెడ్డి కాలనీలోని రష్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలోని రోగులకు మంగళవారం ఉచితంగా దుప్పట్లను పంపిణీ చేశారు. వాతావరణంలో వస్తున్న మార్పులను గుర్తించి చలి తీవ్రత నుండి రోగులు ఉపశమనం పొందేందుకు వీలుగా 500కి పైగా ఉన్నా వారికీ దుప్పట్లను పంపిణీ చేశారు. అలాగే ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ మౌనరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని, రోగులకు పండ్లు పంపిణీ చేసి, అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, డాక్టర్ కీర్తి సాగర్‌రెడ్డి, డాక్టర్ బాబురావు, రోజా, రేష్మ, నూరి పాల్గొన్నారు.

ఆప్యాయతతో.. అభివృద్ధి ఫలాలు వివరిస్తూ...

- గడప గడపకు మన ప్రభుత్వంలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి



పాకాలవారిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వంలో వృద్ధులకు పథకాలను వివరిస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

చంద్రగిరి: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల ద్వారా అర్హులైన లబ్ధిదారుల ఖాతాల్లో అందించిన నగదుతోపాటు అభివృద్ధి ఫలాలను తెలియజేస్తూ మంగళవారం ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు, యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు అగరాల దేవారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెండో రోజు పనపాకం పంచాయతీ పరిధిలో పనపాకం పేట, పాకాలవారి పల్లి, అమాసవారి పల్లి, పాతపేట, రవణప్పగారిపల్లి, కోనంగివారిపల్లి, జక్కులవారిపల్లి, అంబేడ్కర్ కాలనీలో ఆయన పర్యటించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అందిస్తున్న పథకాలను వివరిస్తూ మరోసారి జగనన్నను ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని కోరారు. ప్రతి పల్లెలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన సంక్షేమం స్థానిక ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన అభివృద్ధి కళ్లకు కనబడుతోందన్నారు.

అడుగడుగునా నీరాజనం..

పనపాకం పంచాయతీ పరిధిలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అడుగడుగునా జనం నీరాజనం పలికారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, కొటాల చంద్రశేఖర్‌రెడ్డి, జూపార్క్ డైరెక్టర్ మణి యాదవ్, సింగిల్ విండో చైర్మన్ వరలక్ష్మి, పంచాయతీ అధ్యక్షుడు చెంగల్రాయులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో న్యాయం చేయండి

- అందరికీ భూ పరిహారం అందించండి
- జిల్లా కలెక్టర్‌కు బియ్యపు పవిత్రారెడ్డి విన్నపం



జిల్లా కలెక్టర్‌కు భూపరిహారం జాబితాపై వివరిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

తిరుపతి అర్బన్: నూతన జాతీయ రహదారి ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఇంటి స్థలాలతోపాటు, ఇండ్లు కోల్పోతున్న వారికి భూ పరిహారం అందించడంలో పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని బియ్యపు పవిత్రారెడ్డి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డికి వివరించారు. మంగళవారం ఆమె స్థానిక రైతులతో కలసి కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆమె వివరిస్తూ... జాతీయ రహదారి విస్తరిస్తున్న క్రమంలో రేణిగుంట మండలంలోని కరకంబాడి, సీఆర్‌నగర్ కాలనీకి చెందిన 150 మందికి చెందిన ఇండ్లు, ఇంటి స్థలాలు ప్రభుత్వం తీసుకోనుందని తెలిపారు. వారంతా ఎంతో పేదవారని తెలియజేశారు.

ఎమ్మెల్యే ఆదేశాల మేరకు...

కరకంబాడి, సీఆర్‌నగర్ గ్రామాలకు చెందిన వారంతా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డిని సోమవారం కలిసి, తగు న్యాయం చేయాలని విన్నవించారు. ఆయన ఆదేశాల మేరకు రేణిగుంట మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డితోపాటు రేణిగుంట మండల అధ్యక్షుడు గంగారి రమేష్ మంగళవారం ఆ రెండు గ్రామాలకు చెందిన భూ పరిహారం బాధితులతో కలసి కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారి సమస్యలను కలెక్టర్‌కు పూర్తి వివరాలను తెలిపారు. తప్పకుండా న్యాయం చేస్తామని కలెక్టర్ వారికి భరోసా కల్పించారు. ఈ మేరకు అక్కడే ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ పెంచల కిషోర్‌కు పలు సూచనలు చేశారు. సర్వే ప్రకారం నివేదికను స్పష్టంగా పరిశీలించి, బాధితులు అందరికి వంద శాతం న్యాయం జరిగేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ శ్రీకాళహస్తి ఆర్డీవోతోపాటు, రేణిగుంట తహసీల్దార్ నుంచి పరిహారం ఇవ్వాల్సిన జాబితాను తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. దీంతో ఆ రెండు గ్రామాలకు చెందిన పరిహార బాధితులు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డితోపాటు ఆయన కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి సేవలపై ఎంతో సంతృప్తి వ్యక్తం చేశారు. సమస్యను చెప్పిన వెంటనే నేరుగా కలెక్టరేట్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌తో సంప్రదించి తగు న్యాయం చేయాడానికి కృషి చేస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి రిమాండ్

తిరుపతి లీగల్: మహిళపై హత్యాయత్నానికి పాల్పడిన కేసులో ఒకరికి 14 రోజులపాటు రిమాండ్ విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. కె.మురళి అనే వ్యక్తి తన భార్య యమున అనే మహిళను అదనపు కట్నం కోసం వేధిస్తూ ఆమెపై కిరోసిన్ పోసి నిప్పంటించడానికి ప్రయత్నించాడు. దీనికి పాకాల మండలం, కావలి వారిపల్లికి చెందిన కె.శివకుమార్ సహకరించారని బాధిత మహిళ ఫిర్యాదు చేసింది. అలిపిరి పోలీసులు శివకుమార్‌ను అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పరిచారు.